==========================================================

A Commemorational Article on Swara Brahma K.V. Mahadevan
(On the occasion of his 6th vardhanthi - 06/22/2007)
-- Nanda Kishore Kamavaram

==========================================================

కాశీ మజిలీ కథలలో మనకు తరచుగా వినిపించే/కనిపించే పాత్ర మాంత్రికుడిది. సామాన్యంగా ఈ మాంత్రికులంతా నేపాళ దేశం నుండో లేకపోతే మళయాళ దేశం నుండో వస్తుంటారు. ఈ మళయాళ మాంత్రికులు చేసే విద్యలలో మోడీ లేక మోళీ అనేది చాలా ప్రసిద్ధం. మోళీ అంటే మన కర్మేంద్రియాలను పూర్తిగా తమవైపు తిప్పుకుని కనికట్టు చేయడం.

ఇటువంటి ప్రదేశం నుండి ఒక మాంత్రికుల జంట యావదాంధ్ర దేశాన్ని 4 దశాబ్దాల పాటు తమ మోడీ విద్యతో వారి కర్ణేంద్రియాలను తమ వైపు తిప్పుకున్నారు. కాకపోతే వీరి ఉద్దేశ్యం మాత్రం చాలా పవిత్రమైనది. తెలుగు భాషను మరింత అందంగా చూపడానికి ప్రయత్నించారు. వారే కృష్ణంగోయెల్ వెంకటాచల భగవతార్ మహాదేవన్ మరియు అతని మానసపుత్రుడు పుహళేంది.

కె. వి. మహాదేవన్ తెలుగు సీమకు అడుగుపెట్టింది 1958 ప్రాంతంలో. చేసిన మొదటి చిత్రం 'ముందడుగు'. "చింతపూల రైకదానా" అంటూ మాధవపెద్ది సత్యం గొంతులో వినిపించే పాట మహాదేవన్ తెలుగులో కంపోజ్ చేసిన మొదటి పాటగా చెప్పుకోవచ్చు. అదే సంవత్సరంలో 'దొంగలున్నారు జాగ్రత్త' అనే సినిమాకు కూడా కంపోజ్ చేశారు.

మహాదేవన్ అడుగుపెట్టే సమయానికే No. 1 స్థానంలో ఉన్న సాలూరు రాజేశ్వరరావు, విజయ-వాహిని ఆస్థాన సంగీత విద్వాంసుడు పెండ్యాల, కర్ణాటక హిందుస్తానీ బాణీలను సమానంగా రసికులకు పంచుతున్న మాస్టరు ఘంటసాల గారు, జానపద బాణీలను అలవోకగా సృష్టిస్తున్న మాస్టర్ వేణు, టి. వి. రాజు, అప్పుడే సినీ రంగంలో అడుగుపెట్టిన రమేష్ నాయుడు, కోదండపాణి, అశ్వత్థామ వంటి అతిరథ మహారథులంతా సంగీత రంగంలో ఉజ్వలంగా వెలుగుతున్నారు.

మహాదేవన్ 'ముందడుగు' తర్వాత 5, 6 సినిమాలు 'దొంగలున్నారు జాగ్రత్త', 'నువ్వా-నేనా' లాంటివి పెద్దగా హిట్ అవ్వలేదు. 1962 లో ఆయన మొదటి సూపర్ హిట్ సినిమా రిలీజ్ అయింది. అదే 'మంచి మనసులు'. అందులో ఉన్న నేటి పరిభాషలోని మాస్ సాంగ్ "మామ మామా మామా" తెలుగు సినీ రసికులను ఉర్రూతలూగించింది. దీనితో మహాదేవన్ తెలుగు సినిమా పాటకే కాదు కాదు తెలుగు చిత్రసీమకే "మామ" అయ్యారు. అందులోని ప్రతి పాట ఆణిముత్యమే! అప్పుడే మొదలైంది తెలుగు చిత్రసీమలో గంగా, యమున ల సంగమం - అది ఆత్రేయ, మహాదేవన్ ల సంగీత సంగమం. వీరిద్దరూ కలిసి చేసిన పాటల గురించి చెప్పాలంటే ఒక ప్రత్యేక వ్యాసం రాయాల్సిందే!!

"అహో ఆంధ్రభోజా.. శిలలపై శిల్పాలు చెక్కినారు "
"ఒహో ఒహో పావురమా.. "
"నన్ను వదిలి నీవు పోలేవులే.."
"ఏమండోయ్ శ్రీవారూ.."

ఇంత మంచి మాటల రత్నాలతో పొదిగిన పాటలను స్వరపరచిన మామకు తెలుగు భాష అర్థం కాదు అంటే ఆశ్చర్యమే కదా!! కానీ అది అక్షర సత్యం. "పాటకు మాటదా ముఖ్యం - మాట లేనిదే పాటదా లేదురా!" అనే మహాదేవన్ స్వర సారథ్యంలో ఎన్నో మాటల్లాంటి పాటలు, పాటల్లాంటి మాటలు వచ్చాయి.

ఆత్రేయ, ఆరుద్ర మామతో ఎక్కువగా పని చేసిన గేయ రచయితలు. తరువాతి కాలంలో వేటూరి ఎక్కువగా పని చేసారు. ' మంచి మనసులు ' పెద్ద హిట్ అయిన తరువాత కూడా మామకు పెద్దగా అవకాశాలు రాలేదు. కానీ వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసే పట్టుదల ఉన్నది.

1964-65 మామ సినీ సంగీత పయనంలో స్వర్ణ ఘట్టం. చేసిన చిత్రాలన్నీ జూబ్లీ హిట్స్. 'దాగుడుమూతలు ', 'మూగమనసులు ', 'అంతస్తులు ', 'తేనెమనసులు ' తెలుగు సీమలో మామను తిరుగులేని MD గా establish చేసాయి. అటు NTR తో, ఇటు ANR తో, ఆపైన శోభన్ బాబు, కృష్ణ లాంటి కొత్త హీరోలకు కలిపి అందరికీ హిట్స్ ఇచ్చారు.

"గోరింక గూటికే చేరావు చిలక.."
"దివి నుండి భువికి దిగివచ్చే.."
"నీ ఎదుట నేను.. వారెదుట నీవు.."
"నిను వీడని నీడను నేను.."
లాంటి పాటలు ఒక ఎత్తు అయితే, రాసిన ఆత్రేయకు, పాడిన ఘంటసాలకు, అభినయించిన ANR కు చలనచిత్ర అమరత్వం ప్రసాదించిన ' మూగమనసులు 'లోని "పాడుతా తీయగా చల్లగా" పాట ఒక ఎత్తు.

' మూగ మనసులు ' లోని పాటలలోని విశేషం ఏమిటంటే ఆ పాటలన్నీ మాటలుగా వాడగలిగే సౌలభ్యం!!
".. పోయినోళ్ళు అందరూ మంచోళ్ళే.."
"..నవ్వినా ఏడ్చినా కన్నీళ్ళే వస్తాయి.."
"..చావు పుటక లేనిదమ్మ నేస్తమన్నదీ.."
"..మానూ మాకును కాను.. మామూలు మడిసిని నేను.."

ఇలా ఉదహరిస్తూ పోతే మామ పాటలన్నీ ముత్యాల మూటలే! మంచి సాహిత్యానికి మామ పాటల కొలువులో అగ్రస్థానం.

1966 మరియు 1967 మామ సినీ జీవితంలో మర్చిపోలేని మైలురాళ్ళు. 1966 లో ' ఆత్మగౌరవం ' తో విశ్వనాథ్ పరిచయం, 1967 లో ' సాక్షి ' చిత్రంతో బాపు తో విడదీయరాని బంధం.

1967-1992 వరకూ అంటే సరిగ్గా పాతికేళ్ళు నిరాటంకంగా సాగింది బాపు-మామ ల బంధం. కాలగమనంలో వీరి అనుబంధంలో వచ్చినన్ని సంగీత కావ్యాలు మరే combination లో రాలేదంటే అతిశయోక్తి కాదు. బాపూరమణీయానికి, ఆరుద్ర, మహాదేవన్ లు తోడైి సాక్షి, బంగారుపిచ్చుక, బుద్ధిమంతుడు, అందాలరాముడు, సీతాకళ్యాణం, సంపూర్ణ రామాయణం, ముత్యాల ముగ్గు, గోరంతదీపం, మొదలైన ఎన్నో ఆణిముత్యాలను మనకందించారు. ఇన్ని చిత్రాలలో ఏ ఒక్క చిత్రం తీసుకున్నా అందులోని సంగీతం గురించి వ్యాసాలు రాయవచ్చు. ' సీతాకళ్యణం ' కేవలం పాటలతోనే నడిచిన సంగీత కావ్యం. ' ముత్యాల ముగ్గు ' లో అనితరసాధ్యుడు, కంపోజ్ చేయడానికి inspiration అవసరం లేని ఏకైక genuine composer అని పేరు తెచ్చుకున్న 'సజ్జద్ హుస్సైన్ ' ను మామ పరిచయం చేసారు. స్నేహం హిందీలో లక్ష్మీకాంత్ ప్యారేలాల్ జీవితాన్ని మార్చిన చిత్రం. కాని మామ ఆ ట్యూన్ లను యథాతథంగా తీసుకోక తనదైన బాణీలో అనువదించారు. ' పెళ్ళిపుస్తకం ' ఈ కాంబినేషన్ లో చివరి చిత్రం. పెళ్ళి పాటలలో అంతవరకు అగ్రస్థానం కొరకు పోటీ పడుతున్న అన్ని పాటలను వెనకకు తోసి ముందుకు వచ్చి నిలుచుంది మామ పాట - "శ్రీరస్తు.. శుభమస్తు.. శ్రీకారం చుట్టుకుంది పెళ్ళిపుస్తకం".

కళాతపస్వి విశ్వనాథ్ - మామ ల అపూర్వ సంగమం 1966 లో ప్రారంభమైంది. విశ్వనాథ్ తన మొదటి చిత్రం ' ఆత్మగౌరవం' కి మామనే ఎన్నుకున్నారు. ఇక తరువాత మొదలైంది వారి సినీ జంట జీవనం. వారిద్దరూ కలిసి చేసిన ఆణిముత్యాలు..

ఆత్మగౌరవం, ఊండమ్మా బొట్టు పెడతా, చెల్లెలి కాపురం, సీతకథ, జీవనజ్యోతి, జీవితనౌక, కాలాంతకులు, ప్రేమబంధం, సిరిసిరిమువ్వ, సీతామాలక్ష్మి, శంకరాభరణం, సప్తపది, శుభలేఖ, జననీ జన్మభూమి, శుభోదయం, శృతిలయలు, స్వాతికిరణం. వేటూరి తన కలం వాడిని, వేడిని చూపింది ఈ combination లోనే!!

"మధురానగరిలో.. యమునాలహరిపై.. అచ్చెరువన అచ్చెరువగ విచ్చిన కన్నులతో.."
"ఝుమ్మంది నాదం.. సై అంది పాదం.. తనువూగింది ఈ వేళా.."
"దొరకునా ఇటువంటి సేవ.. నీ పద రాజీవముల చేరు.."
"కంచికి పోతావా కృష్ణమ్మా.. ఆ కంచి వార్తలేవో చెప్పమ్మా.."

'సిరివెన్నల' కురిసింది మామ బాణీలకే! హరిప్రసాదుని మోహన మురళి వినిపించింది తెలుగునాట మామ composition లోనే!! ఈ సినిమాలోని "ఈ గాలీ.. ఈ నేలా.." పాట మొత్తం బాలు ఒక్కరి గాత్రంతో ముగిసి పోతుందనుకుంటుంటే చివరలో సుశీలమ్మతో గళం కలిపించిన తీరు అమోఘం. దానితో పాట ఇంకాస్త మధురంగా మారింది!

మామతో మర్చిపోలేని అనుబంధం పెంచుకున్న నిర్మాతలలో జగపతి పిక్చర్స్, సురేష్ ప్రొడక్షన్స్, యువ చిత్ర (కె. మురారి), అన్నపూర్ణ బ్యానర్ ముఖ్యమైనవి. తరువాత కాలంలో భార్గవ్ ఆర్ట్ ప్రొడక్షన్ బ్యానర్ పై ఎస్. గోపాల్ రెడ్డి ముఖ్యులు.

మామ పేరులోని 'మ' అక్షరంతోటే తాను తీసే సినిమాలకు పేర్లు పెట్టి గోపాల్ రెడ్డి హిట్ మీద హిట్ ఇచ్చారు. 1984-90 ప్రాంతంలో సినిమాలలో సంగీతం పూర్తిగా మాయమయింది అనుకుంటున్న తరుణంలో మామ బాణీలకు మాత్రం ముసలితనం రాదు అని నిరూపించిన చిత్రాలు ఈ భార్గవ్ ఆర్ట్స్ సినిమాలు - మంగమ్మగారి మనవడు, మా పల్లెలో గోపాలుడు, మువ్వ గోపాలుడు, ముద్దులమావయ్య, మన్నెంలో మొనగాడు, ముద్దుల మేనల్లుడు.

మామ సినీ గాయకులందరికీ ప్రీతిపాత్రులు. ఎందుకంటే ఆయన గాయకుల కష్టాలను అర్థం చేసుకునే తీరే వేరు. గాయకుడి గాత్ర ధర్మాన్ని బట్టి కంపోజ్ చేసేవారు. గాయకులు తను చేసిన శృతిలో పాడలేకపోతే వారికి తగిన శృతిలోనే పాడించేవారు.

బాలు తన మొట్టమొదటి సోలో పాడింది మామకే (పాడుకో పాడుకో - ప్రైవేట్ మాస్టర్)! అంతేకాక బాలుకి మొట్టమొదటిగా national award ఇప్పించిన ఘనత మామ పాటదే (శంకరా. నాదశరీరాపరా - శంకరాభరణం)!!

అలాగని మామ ఒకే గాయకుడిని పోషించలేదు. అందరికీ సమానంగా అవకాశం ఇచ్చారు.. శంకరాభరణం పాటలు బాలు పాడలేను అన్నప్పుడు, మామ "వద్దులే, వాడు పాడలేను అంటున్నాడు కదా ఎందుకు అతన్ని బలవంత పెట్టడం.. వేరెవరికైనా ఇద్దాములే' అని సున్నితంగా విశ్వనాధ్ కు చెప్పగలిగిన మంచి మనిషి. కానీ తరువాత పుహళేంది పట్టుదల మీద బాలూనే అన్ని పాటలు పాడారనుకోండీ!

హిందీ మ్యూజిక్ డైరెక్టర్స్ తో పోల్చవలసి వస్తే సాలూరిని నౌషద్ తో, పెండ్యాలను మదన్ మోహన్ తో, ఘంటసాలను సి. రామచంద్ర తోనూ, హిందీలో అత్యధికంగా హిట్స్ ఇచ్చిన శంకర్ జైకిషన్ తో మామను పోల్చవచ్చు. ఎందుకంటే మామ చేసినన్ని సినిమాలు వేరే ఏ సంగీత దర్శకుడు చెయ్యలేదు.

మహాదేవన్ గురించి ఒక చిన్న article రాయమని శ్రీని నన్ను అడిగినప్పుడు నేను రాయలేను అని అందామనుకున్నా. ఎందుకంటే మహాదేవన్ గురించి నాలాంటి సంగీత జ్ఞానం ఏమాత్రం లేనివాడు రాయడం గొప్ప సాహసమే! అయినా ధైర్యం చేసి రాయడానికి పూనుకున్నాను.

అలాగే మహాదేవన్ composition లో మీకిష్టమైన ఒక రెండు పాటల గురించి రాయమన్నారు. ఇది అన్నిటికన్నా కష్టమైనది. ఎందుకంటే 1962-1995 వరకు మామ కంపోజ్ చేసిన పాటల్లో నాకిష్టమైనవి ఒక 150-200 దాకా చెప్పు అంటే అవలీలగా చెప్పొచ్చు. కాని ఒకటి రెండు అంటే చాలా కష్టం.

సరే ఈ విషయంలో నాకు నేనే కొన్ని ఆంక్షలు విధించుకున్నాను. అవి విశ్వనాధ్ - బాపు చిత్రాలు కాకూడదు. జగపతి - అన్నపూర్ణ - సురేష్ ప్రొడక్షన్స్ - భార్గవ్ ఆర్ట్ లాంటి బ్యానర్ నుండి ఉండకూడదు.

ఇలా విధించుకున్నా కూడా ఒక 30-40 దాక పాటలు వచ్చాయి అందులో మొదటగా కనిపించింది..
"ధనమేరా అన్నిటికీ మూలం.."

సరే ఇంకో నియమాన్ని విధించుకుందాం అనుకున్నాను. అది ఏమిటంటే అద్భుతమైన సాహిత్యం ఉండకూడదనిది అని. ఇప్పుడు కాస్త ఛాలెంజింగ్ గా అనిపించింది. ఇన్ని ఆంక్షలు పెట్టుకున్నా కానీ ఒక 15-20 పాటలు మేమంటే మేమని ముందుకు వచ్చాయి అందులోనుండి ఒక రెండు పాటలు నాకు అత్యంత ఇష్టమైనవి మీముందుంచుతున్నాను.

-> "ఈ ఉదయం.. నా హృదయం" కన్నె మనసులు లో ఆత్రేయ సాహిత్యానికి ఘంటసాల పాడిన పాట. చాలా హాయిగా సాగుతుందీ పాట. మాస్టారి హమ్మింగ్ తో పాటు ఆర్కెస్ట్రా కూడా హమ్ చేస్తుంది.

-> సుశీలమ్మ గొంతులో అమృతం ఉంది దాని రుచి చూడండి అంటూ మామ మోహిని అవతారం ఎత్తి మనకు ఆ అమృతం పంచారు ఏకవీరలోని ఈ పాటతో "నీ పేరు తలచిన చాలురా మదిలో పొంగు"!!

-- నందకిశోర్ కామవరం
జూన్ 22, 2007
(chiltu@gmail.com)

రచయిత గురించి :
-----------------------------
స్వగ్రామం: ఆదోని (కర్నూలు జిల్లా); వృత్తి: కెనరా బ్యాంకు లో Software Implementing Officer, బెంగుళూరు.

సంగీత, సాహిత్యాలతో ప్రగాఢమైన అనుబంధం ఉన్న నందకిశోర్ గారికి సాహిత్యపు విలువలున్న ప్రతీ పాట ఇష్టమే! తనకి ఎంతో స్థైర్యాన్ని ఇచ్చిన "ఎక్కడ ఉన్నా ఏమైనా (మురళీకృష్ణ) ", "ఎప్పుడూ కోరుకోవద్దురా ఓటమి (పట్టుదల) " లాంటి పాటలకు మాత్రం ప్రత్యేక స్థానం ఇస్తారు. బాలు పాటలంటే ప్రాణమిచ్చినా సైగల్, తలత్ మెహమూద్, రఫీ, కిషోర్ కుమార్ వంటి హిందీ గాయకుల. ఘంటసాల, సుశీల, జానకి వంటి తెలుగు గాయకుల పాటలను కూడా అంతే ఆసక్తితో వింటారు. కొందరు నటులు (కృష్ణ, దేవానంద్) కేవలం పాటల వల్లనే అభిమాన నటులయ్యారంటే అతిశయోక్తి కాదు. అలనాటి పాటల రచయితలు, సంగీత దర్శకులందరూ నచ్చినవారే. ఈనాటి సినీ సాహిత్యంలో వెన్నెలలు కురిపిస్తున్న సీతారామశాస్త్రి అంటే ప్రత్యేకమైన అభిమానం.

విశ్వనాథ, యద్దనపూడి, యండమూరి నవలలంటే ఇష్టమున్నా తిమ్మన వారి "పారిజాతాపహరణం ", పింగళి సూరన వారి "రాఘవపాండవీయం " లాంటి ప్రాచీన కావ్యాలంటే మక్కువ ఎక్కువ. బాణభట్టుని "కాదంబరి" , Ayn Rand’s "Atlas Shrugged"

అత్యంత ఇష్టమైన పుస్తకాలు.

ChimataMusic.com లో పాటలు వింటూ, db లో active గా పాల్గొనడం తన దినచర్యలో అతిముఖ్య భాగమై పోయిందంటున్న నందకిశోర్ గారు డిబి లో సినీ లోకానికి చెందిన ఆసక్తికరమైన విషయాలను తెలియబరచడం / తెలుసుకోవటం లో ఎంతో ఆసక్తిని కనబరుస్తారు.

------------------------------